తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 01 బుధవారం 07 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 1




# దత్తప్పగూడెం గ్రామపంచాయతీకి వీడీబీ కంపెనీ రూ.12 లక్షల ఆస్తి పన్ను ఎగనామం..?



## ఐదేండ్లుగా పన్ను చెల్లించకుండా మొండికేసిన కంపెనీ

- మూడుసార్లు నోటీసులు ఇచ్చినా డోంట్ కేర్
- డీపీవోకు లెటర్ పంపిన పంచాయతీ సెక్రటరీ
- సర్పంచ్, పాలకవర్గం చొరవ చూపితేనే వసూలవుతామంటున్న గ్రామస్తులు

**ప్రజావారధి/మోత్కూరు**

యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో 930పీ నేషనల్ హైవే రోడ్డు పనులు చేసే కాంట్రాక్ట్ కంపెనీ గ్రామపంచాయతీకి బకాయి పడిన సుమారు రూ.12 లక్షల ఆస్తి పన్ను చెల్లించకుండా ఎగనామం పెట్టే సూచనలు కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీకి రూ.లక్షల్లో ఆస్తి పన్ను బకాయి పడి కంపెనీ మొండికేస్తుండగా పంచాయతీ అధికారులు, సర్పంచ్, పాలకవర్గం ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న డబ్బులు వసూలైతే గ్రామాభివృద్ధికి ఉపయోగపడతాయని, కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ కూడా ఇన్నేండ్లు గ్రామ వనరులు వాడుకుని ఇలా ఆస్తి పన్ను చెల్లించకుండా మొండికేయడమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

### మూడుసార్లు నోటీసులు ఇచ్చినా డోంట్ కేర్

వీడీబీ కంపెనీకి బకాయి ఉన్న ఆస్తి పన్ను చెల్లించాలని దత్తప్పగూడెం గ్రామపంచాయతీ నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. కంపెనీ కార్యాలయం వద్ద కూడా అంటించారు. ఇటీవల కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత కూడా గత మార్చిలో తీర్మానం చేసి మరోసారి నోటీస్ జారీ చేశారు. అయినా డోంట్ కేర్ అన్నట్టు కంపెనీ యాజమాన్యం, ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు. యాదాద్రి జిల్లా వలిగొండ గౌరెల్లి జంక్షన్ నుంచి (వలిగొండ-తొర్రూర్ రోడ్డు) భద్రాద్రికొత్తగూడెం వరకు నేషనల్ హైవే 930పీ రోడ్డు ఫేజ్-2 పనులను బెంగళూరుకు చెందిన వీడీబీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దక్కించుకుంది. సుమారు రూ.350 కోట్లతో రోడ్డు పనులు చేసేందుకు వీడీబీ కంపెనీ దత్తప్పగూడెం వద్ద 2021 డిసెంబర్ చివర్లో కంపెనీ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసింది. సర్వే నంబర్లు 148, 149లో సుమారు 15 ఎకరాల స్థలం లీజ్‌కు తీసుకుని కంపెనీ కంకర క్రషర్లు, మిషన్లు, మెటీరియల్, ఆఫీసులు ఏర్పాటు చేసి 2022 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. గ్రామపంచాయతీ నుంచి ఎన్‌వోసీ కూడా తీసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డుల పరంగా 2022 నుంచి నేటి వరకు సుమారు ఐదేండ్లుగా కంపెనీ గ్రామపంచాయతీకి పైసా ఆస్తి పన్ను చెల్లించలేదు. పేదోడు రూ.500, వెయ్యో ఇంటి పన్ను బకాయి ఉంటేనే అవి కట్టేదాక ఇంటి చుట్టూ తిరిగే పంచాయతీ అధికారులు, సిబ్బంది పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న కంపెనీపై మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. రూ.12 లక్షల ఆస్తి పన్ను బకాయిలు వసూలైతే గ్రామంలో అభివృద్ధి పనులకు ఎంతో ఉపయోగపడనున్నాయి. గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కంపెనీతో లాలూచీ పడటంతోనే పన్ను చెల్లించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచ్, పాలకవర్గం కూడా కంపెనీ పట్ల సైలెంట్ అయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే రోడ్డు పనులు దాదాపుగా పూర్తయి కంపెనీ అక్కడి నుంచి వాహనాలను, మెటీరియల్‌ను తరలిస్తుందని చెబుతున్నారు. కంపెనీ పూర్తిగా తరలిపోకముందే పన్ను బకాయిలను వసూలు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా వీడీబీ కంపెనీ స్పందించకపోవడంతో తదుపరి చర్యల కోసం పంచాయతీ సెక్రటరీ యాదాద్రి జిల్లా పంచాయతీ అధికారికి లెటర్ పంపినట్టు తెలిసింది. వీడీబీ కంపెనీ ఆస్తి పన్ను బకాయిల చెల్లింపులపై వివరణ కోరేందుకు కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు.

### డీపీవోకు లెటర్ పంపాం

**-యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, దత్తప్పగూడెం**

వీడీబీ కంపెనీ ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేశాం. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినప్పటికీ వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. విషయంపై జిల్లా పంచాయతీ అధికారికి లెటర్ కూడా రాశాం. సుమారు రూ.12 లక్షల బకాయిలను వసూలు చేసేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గంతో మరోసారి చర్చించి వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.